

# వానచినుకులు

వి. రాజారామమోహనరావు

కిటికీలోంచి...కురిసే వానలోంచి గతం లోకి చూసుకుని తమనితాము తడుముకోవటం చాలా మందికి అలవాటు.

దూరాన్ని రూపుమాపుతూ రేడియోలో సంగీతం....ఒక్కొక్క చినుకే సంగీతంతో పడుతోంది అరుగు పక్కన నీళ్ళ గుంటలోకి...

సిగరెట్ పారేయటానికి బయట పెట్టిన చేతిమీద ఒకే ఒక వానచినుకు, గతాన్ని సాక్షిభూతం చేసుకుంటోంది ముత్యరూపంలో...

అరగతీసిన మంచిగంధం చెక్కలాంటి వాణి మెరుపు మెడ వొంపులో ఆనాటి వానచినుకు...తన స్నేహితుని పంక్తిలో...

ఎవరో పాప వర్షంలో తడుస్తూ,

నవ్వుతూ ... వొణుకుతూ గెంతుతూ వెడుతోంది కిటికీ ముందునుంచి...

బాల్యంలో, యవ్వనంలో...ముసలి తనంలోకూడా, వానలో తడవటం సన్నని తృప్తిరేఖల అనుభవం...

''వెళ్ళి వానలో తడిస్తే''... చేతి మీద ఇంకో చినుకు పడింది. సన్నని పాశం లాగేసింది వెనక్కి...మళ్ళీ అనంతతృప్తిలోకి...

''వాణి ఎలా ఉందో?...'' వర్షపు సాయంత్రం ఆనాటి వాణిమెడమీద వానచినుకుల రుచి...నాలుక జిల్లుమన్న గుర్తు...

''ఎలాగా ఇటువేపు వచ్చావు...ఇంక పంద మైళ్ళే కదా, వెళ్ళి వాణిని చూడ కూడదా?'' అనడిగిన లలితకి ఏం సమా ధానం చెప్పగలను? నాలోని ఆనాటి నిర్లక్ష్యం...కేవలం అందాన్ని తప్ప, అనుభవాన్ని తప్ప...మృదు బంధాన్ని తప్ప...ఆడతనాన్ని, ఆడతనపు విలు వని తెలుసుకోలేకపోయిన తెలివి తక్కువతనాన్ని ఎలా వొప్పుకోవటం? చిన్న చిరునవ్వే ఆయుధం లలితకి సమాధానంగా...

''పోనీ వెళ్ళి వాణిని చూస్తే...'' ఈదురుగాలి చెంపని కదిపింది. తల తిప్పితే...

పక్కమీద ఏనాటిదో దుప్పటి రంగు వెలిసి మెరుస్తోంది...

వాణి...మార్పు...మార్పు ఈ జీవన చైతన్య నౌకకి చక్కటి ఇంధనం...

''అవును వాణిని చూడాలి''

చెట్టుమీద చినుకులు ఒక్కసారి నవ్వాయి గబుక్కుని కిందకి దూకుతూ... కిటికీలోంచి...

* * *

లీలగా ... భయంగా, ఆనందంగా, ఆవేశంగా కోరుకున్న దాని చేరువ... గుండె వణుకుతోంది...చేతిలో సిగరెట్ వణుకుతోంది, తలుపు కొడుతుంటే...

తలుపులు తెరుచుకున్నాయి...ఒక్క క్షణం ఆలోచనకి తాళం పడింది...

కళ్ళల్లో ఒక్కసారి మండినవెలుగు. పెదవులమీద మృదువుగా పగిలిన నవ్వు.. ఆసంకల్పంగా కదలిన చిన్న కదలిక.. తలుపు పట్టుకుని అలా వాణి...అదే మెరుపు మెడలో...పచ్చటి మంగళ సూత్రాల గొలుసు సముద్ర తరగల్లో... పచ్చటి వెలుగు...

తృప్తిగా ...ఎన్నాళ్ళనుంచో ఉగ్గ బట్టిన శ్వాస వదిలినట్టు నిట్టూర్చింది వాణి...''నిన్ను చూశాను...ఇన్నాళ్టికి'' అంటూ...

తెలుసుకోవాల్సింది, సంవత్సరాల మడతల్లోది, పూర్వపు పునాదుల్లోది, ఎంతో ఉంది ... తెలుసుకోవాలన్న ఆకాంక్ష ఉంది...కాని మాటలు రావు... కళ్ళ మెరుపు తప్ప...




"ఏరి?"... 'మీవారు ఏరి" అని అనలేకపోతున్నారని తెలుసు...

"వస్తారు సాయంత్రం" కొద్దిగా వంగింది వాణి మెడ...

అడ్డపడిన జలపాతం అడ్డుదూకింది.. నవ్వుల్లో...చమర్చిన మనసుతృప్తిలో.. స్వచ్ఛమైన ఆనందంలో .. ఎన్నో సంగతులు...

తలెత్తుకు నిలబడుతోంది బలంగా. ఇంత ఆనందాన్ని శాశ్వతంగా అందుకోలేకపోయిన దౌర్భాగ్యం.

"ఆయన చాలా మంచివారు"

వాణి మిగిలిన మాటల్లా రుచించలేదిది...

* * *

అలాగే గడచిన రెండురోజుల్లో... వదులుకోలేని చేరువ, ఎక్కడో చలవదనం చిక్కబడుతున్న తెరల వెనకాల వాళ్ళు విరుచుకుంటున్న అపేక్ష .. రాత్రి ఒంటరిపడక ... జంట విలువని జీవితంలో తోడుస్థానాన్ని ఎత్తి చూపిస్తూ...

తీయటి తమలపాకులో... అక్కడో ఆకుకి, అక్కడో ఆకుకి విషం రాసుకు తయారైన తాంబూలం ఈ ఆనందం. ఈ విషానికి మరణంరాదు, చేదే మిగులుతుంది.

'వాణి... నిండుగా... బాధపడదేం. కోల్పోయిన దానికోసం గతంకోసం. ఒక్క కన్నీటిచారకూడా లేదాకళ్ళల్లో.

ఏనాటిదో. ఎవరిదో కథలా మరిచి పోయిందా గతాన్ని...?"

గుండెమీద పూరేకుపరచి పదునైన శూలం దింపుతోంది ఈ అనుభవం...

'భర్తదగ్గర వాణికి ఏం గుర్తుండదా? ఆవాణేనా ... ఎలా....ఎలా ... తనలో ఏమాత్రం స్థానంలేని నాకు... ఏమిటి మిగిలింది?'

గదిలోంచి ఘల్లుమంది నవ్వు...

'గొంతుకనుంచి గుండెలవరకు తడి ఆరిపోయినట్టయింది. ఎందుకు ఇంత బలవంతంగా విషంలాంటి ఈ అనుభవం. రేపే వెళ్ళిపోవాలి. ఈక్షణమే వెళ్ళగలిగితే ఎంత బాగుండును. వెళ్ళిపోతే అడ్డేదేముంది?'

కాళ్ళ వేళ్ళ నరాలు బిగుసుకున్నాయి.. మనసుకేలేదు అబిగువు.

ఇప్పుడుకాదు...రేపు...వాణిని కళ్ళ నిండుగా చూసి రేపు...

నానిద్రలేని రాత్రుల సంఖ్య ఇంకొక దాన్ని చేర్చుకుంటోంది ..

తెల్లవారుజామున పవిమనిషికి తలుపు తీస్తూ, నలిగిన చీరమడతల సవరింపులో వాణి....

తెల్లారిందన్న ఆశతో, బలవంతంగా అందుకుంటున్న ఊపిరి మధ్యలోకి విరిగింది.

* * *

"ఇవాళ వెడతాను"

"ఇవాళ ఒక్కరోజు ఉండవూ!"

భర్తచేరువలో వాణికాదు ఈవాణి. ఈ కళ్ళతడిలో, ఈ దీనత్వంలో ఈవాణి వేరు. ఈ దీనత్వానికి, ఈబంధపు వారికకి లొంగనివాళ్ళు ఎవరూ ఉండరా?

చీకటి పడేవరకూ మళ్ళీ అదే మధురిమ....తీపిపూసుకున్న చేదులా....

వేసవి వర్షాకాలాల సరిహద్దు సాయంత్రం...దొడ్లో మల్లెపందిరికింద, దూరపు స్థూలపు లెఖల్లో దగ్గరగా కూర్చున్న మామీద వాన చినుకులు....

ఎన్నాళ్ళదో...ఏనాటిదో ఆవేశం... కొన్నిక్షణాల్లో రెక్కలు పెంచుకు వాళ్లు విరుచుకుంది.

చేతులు వణుకుతున్నాయి. వాణీ వెన్నెముక నావేళ్ళల్లో కరుగుతోందా?

"అబ్బ!"

"ఏం వాణి"

నవ్వు ... బాధైననవ్వు, కడుపు రాసుకుంటూ.

అవును వాణీలో ఆవిందు... ఎన్నో రంగులు పూసుకున్న మెడమెరుపు నలిగిన అందాలు దాచుకున్న ఆకళ్ళ బరువు...

"ఎన్నోనెల?"

"నాలుగు..." తలవంచుకుంది...

కాదు ... నా దేం లే దిక్కడ ... భ్రమ...

* * *

మింగిన తీయనివిషం ఆ అనుభవం... తీయని స్లోపాయిజన్ ... తన ప్రభావం చూపుతోంది ఈ రెండునెలలుగా ...

పాత కమ్మటికలలు...స్మృతులు... వికారపు అంచులులేని ఆలోచనలు.వర్షం చినుకుల్లో, మల్లెపూల వాసనల్లో ... ఋతువుల సరిహద్దు సాయంత్రాల్లోనిలువు కున్న జ్ఞాపకాల్ని, ఒక్కొక్క దాన్నే తినేస్తోంది ఈ విషం ...

ఆనుభవానికి దూరంగా, ఆలోచనలకి, జ్ఞాపకాలకి దగ్గరగా ఉండాలన్న ఈ ప్రయత్నంలో వాణి ఉత్తరం మళ్ళీ ...

నీ కేం రాయను...అలా వచ్చావు? ఎందుకో ... ఏమో ఇద్దరికీ తెలియని స్థితిలో ... బాధపడుతున్నావా? ఒక్క సారి రావూ...తల్లి అవటం ఆడదానికి రెండోజన్మట...ఈ ఒక్కసారిరావూ...

'వాణి'

కేవలం ఉత్తరమేనా ఇది...కాదు... గుండెల్నిపిండే శక్తుంది ఆ మాటలకి .. 'ఈ ఒకేఒకసారిరావూ' వెళ్లనా,ఆ తీయని విషాన్ని మళ్ళీమింగనా ... గతం గదుల్లోకి భావిని తీసికెళ్ళి సమాధిచేయనా...

మెదడులో నరాలు ఒక్కుమ్మడిగా పనిచేస్తున్న బాధ ...

'వద్దు ... వాణితో కొండలెక్కి, లోయల్లోకి ఉరికే ఆ అనుభవంవద్దు ... నే భరించగలిగినా, వాణి...వాణి భర్త... వద్దు...'

ఈనాటివరకూ నిజంగా నాకు వాణి తెలియదు.. వాణిభర్త ఉత్తరం రాయక పోతే ఈనాడూ తెలియదు.

మీ యిద్దరిగురించి నాకు వాణి ఏనాడో చెప్పింది. చిన్నప్పటినుంచి కలిసి పెరిగిన ఆత్మీయత మీది ... జీవితంలో యవ్వనం పులిమే స్వచ్ఛమైన రంగులు నింపుకున్న మనసులు మీవి... వాణిని మీరు తిన్నగా అర్థం చేసుకోలేదు. మీరు మాతో ఎన్నాళ్ళుకలిసి ఉన్నా వాణి మీతో ఏ తప్పూ చెయ్యదు. చేయలేదు. పెళ్ళయిన నాటినుంచి మీరు ఆత్మీయతకి, మనసుకు ప్రియమైన రూపానికి గుర్తు వాణికి. వ్యక్తిగా మీమీద వాణికి దృష్టే లేదు. అర్థం చేసుకోలేక పోయారు గనుకనే రమ్మన్నా రాలేక పోయారు. ఈనాడు వాణీలేదు. రెండోసారి జన్మెత్తలేక పోయింది. చివరివరకూ మిమ్మల్నే వెతుక్కుంది...

"........."

సాంఘికంగా ఇంకొకరి భార్యని ఎంత ఆత్మీయురాలైనా నా దృష్టితో చూడటం తప్పే ...

నా మనసు ఇనప్పెట్టిగా మారటానికి, అలవాటుకి, కాలానికి మనసుకానిపని నేను నమ్మటానికి కేవలం భయం, సంప్రదాయాన్ని ఎదిరించలేనిభయమేకారణం..

సంప్రదాయ భీరువుని కాకపోతే, నా దృష్టి ఇంత ఇరుకయ్యేదికాదు. ఈ స్మశాన జీవితం అనుభవంలోకి వచ్చేది కాదు.

అందరికి, అన్ని మనసులకి ఒకే నీతిసూత్రంకాదు ... ఒకే సంప్రదాయం కాదు...మీదపడిన చినుకులకి అందరూ ఒకేలా స్పందించరు.

ఈనాడు వర్షం వస్తోంది...నా మీద చినుకులు పడుతున్నాయి...కాని నాలో స్పందనలేదు.